సాక్షి అనకాపల్లి
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



కారణం చెప్పండి

స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు స్పష్టమైన సమాధానంతో సమస్య పరిష్కరించాలని జేసీ కల్పనాకుమారి అన్నారు. 8లో



పులకించిన పొల్లూరు

అల్లూరి జిల్లాలో మన్యంకొండ జాతర ఘనంగా జరిగింది. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 8లో



లక్ష్యం మరవొద్దు

గాజువాక: విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీని నేపాల్ మాజీ మంత్రి ధరవేష్ సందర్శించారు. విద్యార్థులు లక్ష్యం మరువరాదన్నారు.

న్యూస్‌రీల్

ఇద్దరు డీటీలకు షోకాజ్ నోటీసులు

మాకవరపాలెం: భూముల రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లకు జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి షోకాజ్ నోటీసులు జారీ చేశారని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రీ సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. మండలంలో జరుగుతున్న సర్వేను ఈనెల 14న జేసీ పరిశీలించారు. సర్వేలో మండలం వెనుకబడినట్టు గుర్తించిన జేసీ డీటీలు శంకర్రావు, కృష్ణమూర్తిలకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

చిరుధాన్యాల వంటకాలపై శిక్షణ



వంటకాల తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలు

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్య మహోత్సవాల్లో భాగంగా ఇస్తున్న శిక్షణా శిబిరానికి సోమవారం ఏడీఆర్ జగన్నాథరావు హాజరయ్యారు. నాబార్డు సహకారంతో తుమ్మపాల ఎస్వీడీఎస్ కార్యాలయంలో జరుగుతున్న ఈ శిక్షణలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలంతా చిరుధాన్యాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. చిరుధాన్యాలతో కేక్, బ్రెడ్, కిచిడీ, సేమ్యా, స్వీట్స్ వంటి వంటకాలను తయారు చేసుకోవచ్చన్నారు. ఇలాంటి శిక్షణను మహిళలు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి సెక్రటరీ కర్రి జోగినాయుడు మాట్లాడుతూ అనకాపల్లి మండల పరిధిలో జీవనోపాధులు పెంపొందించడంలో తమ సంస్థ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

రైతులకు మూడో విడత భరోసా నేడు

- రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు రూ.55 కోట్లు
- మాండూస్ తుపాను బాధితులకు రూ.16.13 లక్షలు జమ

తుమ్మపాల : వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం నాలుగో సంవత్సరం మూడవ విడత మొత్తాన్ని రైతుల ఖాతాలో మంగళవారం జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు సోమవారం తెలిపారు. 2022–23 ఏడాదిలో అర్హులైన రైతులకు నగదు పంపిణీ కార్యక్రమాన్ని గుంటూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో భాగంగా జిల్లాలో 2.52 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.55 కోట్లు జమకానున్నట్టు తెలిపారు. దీంతోపాటు మాండూస్ తుపాను బాధిత రైతులు 499 మందికి ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.16.13 లక్షలు వారి ఖాతాల్లో వేయనున్నట్టు వెల్లడించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం లేదన్నారు.

విద్యార్థులు దృఢ చిత్తంతో ఉండాలి



విద్యార్థులతో ఈఎండీపీ ప్రోగ్రాం మేనేజర్ దిలీప్‌కుమార్, పరిశీలకులు

నర్సీపట్నం: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి ప్రోగ్రాం ఎంతో దోహదపడుతుందని జిల్లా ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మేనేజర్(ఈఎండీపీ) దిలీప్‌కుమార్ తెలిపారు. వేములపూడి మోడల్ స్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు నమూనాలను సోమవారం ఆయన పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.డి.సంధ్య మాట్లాడుతూ విద్యార్థులు దృఢమైన మనస్తత్వాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఏపీజీఈఏ జిల్లా సర్వసభ్య సమావేశం నేడు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశాన్ని నరసింహానగర్‌లోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జైత్రయాత్రకు శ్రీకారం

- వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ శ్రేణులంతా కంకణబద్ధులు కావాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ మద్దతు అభ్యర్థి సీతంరాజును గెలిపించే బాధ్యత మీదే
- విద్యారంగ అభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఎనలేని కృషి
- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓట్లన్నీ మనకే..
- టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి



అనకాపల్లి సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కో కన్వీనర్లు



మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మశ్రీ, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, ఎంపీ సత్యవతి

సాక్షి, అనకాపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి.. 2024 ఎన్నికల్లో పార్టీ విజయపరంపరకు ఇప్పుడే శ్రీకారం చుట్టాలని టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం అనకాపల్లిలోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో పార్టీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావులు జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికలని, ఈ గెలుపుతో విద్యావంతులంతా విశాఖ పరిపాలనా రాజధానికి మద్దతు తెలుపుతున్నారని చెప్పినట్లు అవుతుందన్నారు. నాలుగు సంవత్సరాలుగా మన ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిని వివరించి ఓటు అడగాలని సూచించారు. ఇటీవల కొన్ని దుష్టశక్తులతో కూడి ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని, వారి యత్నాలను జగనన్న కుటుంబ సభ్యులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సోషల్ మీడియా ప్రతినిధులు తిప్పికొట్టాలని, గడప గడపకూ వెళ్లి వాస్తవాలను వివరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని ప్రజలకు వివరించాలని సూచించారు.

అనకాపల్లి నుంచే అత్యధిక ఓట్లు..

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. అనకాపల్లి నియోజకవర్గంలో 4,711 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు అనకాపల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక ఓట్లు లభించే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మార్చి 18వ తేదీ నుంచి సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. నూకాంబిక అమ్మవారి దేవాలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి రూ.3 కోట్లు మంజూరు చేసినందుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ... కష్టపడి పని చేసే ప్రతీ ఒక్కరికీ పార్టీలో తగిన పదవులు వస్తాయన్నారు. ఓటు వేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ.. పెద్దల సభగా పిలిచే శాసనమండలికి ఎంతో ప్రాధాన్యముందని, సుధాకర్‌ను గెలిపించి ఆలాంటి విధానసభకు పంపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకుడు దాడి రత్నాకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, లక్ష్మి సౌజన్య, మందపాటి సునీత, కొణతాల నీలిమ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలక యశోద, రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పి.రమేష్, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా గున్నయ్య లక్ష్మి, జడ్పీటీసీ శ్రీధర్‌రాజు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్లో జోష్

- ఉత్సాహం నింపిన 'మాడుగుల' సమావేశం



కె.కోటపాడు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, వేదికపై డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్

కె.కోటపాడు: కె.కోటపాడులో సోమవారం నిర్వహించిన మాడుగుల నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ సమీక్ష సమావేశం పార్టీ కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపింది. సభా కార్యక్రమం ప్రారంభానికి ముందే కె.కోటపాడు, మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాల నుంచి సుమారు 5 వేలమందికి పైగా పార్టీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రాంగణానికి చేరుకున్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ బి.వి.సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రసంగాలను ఆసక్తిగా ఆలకించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు ఏ విధంగా మరింతగా వివరించాలో నాయకులు తెలిపిన విధానాన్ని శ్రద్ధగా విన్నారు. తొలుత పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి కె.కోటపాడులో ఘనస్వాగతం పలికారు. సుబ్బారెడ్డి ముందుగా మరిడిమాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అక్కడ నుండి సభావేదిక వద్దకు చేరుకునే క్రమంలో రోడ్డుకు ఇరువైపులా మహిళలు నిలబడి హారతులిచ్చి, పూలతో స్వాగతం పలికారు. ఎంపీపీలు రెడ్డి జగన్‌మోహన్, కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు, వేమవరపు పెదబాబు, కురచా జయమ్మ, బూరె బాబూరావు, తాళపురెడ్డి రాజారామ్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల పరిశోధనలు ఫలవంతం కావాలి

- వాతావరణంలో మార్పులు
- వర్ష రోజులు తగ్గుదల.. వర్షపాతం పెరుగుదల
- జియో ఫిజిక్స్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్
- సముద్ర జలాలపై పరిశ్రమలు, మానవాళి ప్రభావాల జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: శాస్త్రవేత్తల పరిశోధనల ఫలాలు ఫలవంతం కావాలని సర్ ఆర్థర్ కాటన్ జియో స్పేసియల్ చైర్‌పర్సన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ మాజీ ప్రొఫెసర్ పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం విశాఖలోని ఓ హోటల్‌లో 'సముద్ర జలాలపై పరిశ్రమలు, మానవాళి ప్రభావం' అనే అంశంపై రెండు రోజులపాటు జరుగుతున్న జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. సముద్ర జలాలు వేడెక్కుతుండడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. వర్షం కురిసే రోజులు తగ్గుతున్నాయని, వర్షపాతం పెరుగుతోందని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో సముద్ర జలాలు స్వచ్ఛంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సముద్ర అధ్యయన శాస్త్రం మరింత బలోపేతం కావాలన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐవో–గోవా) డైరెక్టర్ సునీల్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ భూతాపం వల్ల వాతావరణ మార్పులతో పాటు సముద్ర వనరులపైనా ప్రభావం పడుతోందని చెప్పారు. ఎన్ఐవో చీఫ్ సైంటిస్ట్ వీవీఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కేజీ బేసిన్ సహా భారత తీర ప్రాంతం చమురు, సహజ వాయువుల నిక్షేపాలతో పాటు ఎన్నో వనరులకు ఆలవాలంగా ఉందన్నారు. ఈ సదస్సుకు భారత భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ, ఎన్ఐవోలకు చెందిన 50 మంది శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సదస్సులో ఎన్ఐవో విశాఖ సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ జీపీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ నిర్ణయం హర్షణీయం

విశాఖ: పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో మొదటి తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని విద్యాశాఖ జి.వో.నం.24 జారీ చేయడం హర్షణీయమని రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. దీనికి సంబంధించి మార్చి 5న లంకపల్లి బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణ కార్యకర్తలు, ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకావాలని కోరారు.

అతిథులకు అదిరిపోయే ఆతిథ్యం



కిట్‌లో ఉన్న జ్ఞాపికలు

- గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు
- దేశ విదేశీ ప్రముఖులకు సిద్ధం చేస్తున్న ప్రత్యేక కిట్లు
- కలంకారీ ఆకృతులు అందించేందుకు ప్రణాళికలు
- మొత్తం 3,000 కిట్లు రెడీ చేస్తున్న అధికారులు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర స్థితిగతులను మార్చేలా ఆర్థిక పురోభివృద్ధిలో కొత్త గమనం సృష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. మార్చి 3, 4 తేదీల్లో జరగనున్న సదస్సుకు దేశ, విదేశీ ప్రముఖులు హాజరవుతున్నారు. వారికి ఆత్మీయ ఆతిథ్యం అందించడంతో పాటు, చిరకాలం గుర్తుండిపోయేలా జ్ఞాపికలు బహూకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం విభిన్నమైన కళాకృతులతో కూడిన 3 వేల కిట్లు తయారు చేస్తున్నారు.

ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో జీఐఎస్–2023 కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉన్నతాధికారులతో పాటు జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పనులను సమీక్షిస్తోంది. దాదాపు 3 వేల మంది ప్రముఖులతో కలిపి మొత్తం 7,500 మంది ప్రతినిధులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరికీ అదిరిపోయే ఆతిథ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సదస్సు ముగిసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ జ్ఞాపకాలను తమ ప్రాంతానికి తీసుకెళ్లే అనుభూతులను అందించేలా కిట్స్ అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఏపీ వస్తువులను జ్ఞాపికలుగా అందించాలనే అంశాలను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. వాటికనుగుణంగా కిట్లను సిద్ధం చేస్తున్నారు.

3 వేల మందికి అందించేలా...

మొత్తం 3 వేల మంది ప్రతినిధులకు ఈ కిట్లు అందించనున్నారు. 8 పేజీల సదస్సు సమాచారం బ్రోచర్‌తో పాటు రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలు, వనరులు, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, పారిశ్రామిక విధానం, ఐటీ పాలసీ, టూరిజం పాలసీతో పాటు 14 సెక్టార్లకు సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరిచిన బుక్‌లెట్‌ను అందించనున్నారు. వీటితో పాటు ప్రత్యేకమైన జ్ఞాపికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర హస్తకళల్లో ఒకటైన కలంకారీ అద్దకాలతో తయారు చేసిన సెరామిక్ వస్తువులను అందిస్తున్నారు. లగేజ్ ట్యాగ్‌లు, నోట్‌బుక్‌లు, సెరామిక్ ప్లేట్, వుడెన్ కోస్టర్స్‌తో పాటు కిట్‌లో ప్రత్యేక ఆకర్షణగా అరకు ఇన్‌స్టెంట్ కాఫీ పొడిని కూడా అందించనున్నారు.

అడ్వాంటేజ్ ఏపీ బ్రాండ్‌గా..



పెట్టుబడుల సదస్సుకు వచ్చే ప్రతి ఒక్క ప్రతినిధికి చిరకాలం గుర్తుండిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని రంగాల్లో అగ్రగామిగా ఆంధ్ర ప్రదేశ్‌ను నిలబెట్టేందుకు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు కొత్త ప్లాట్‌ఫామ్‌గా మారనుంది. అందుకే సదస్సులో పాల్గొంటున్న ప్రముఖుల కోసం ప్రత్యేక ఆతిథ్యంగా కిట్లను తయారు చేస్తున్నాం. అడ్వాంటేజ్ ఏపీ అనే నినాదం ఒక బ్రాండ్‌గా మారనుంది.

– డా.జి.సృజన, రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్

పట్టభద్రుల బరిలో 37 మంది

- 4 నామినేషన్ల తిరస్కరణ, ముగ్గురు ఉపసంహరణ
- మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్
- 16న స్వర్ణభారతి స్టేడియంలో ఉదయం 8 నుంచి కౌంటింగ్
- నేటి నుంచి బీఎల్‌వోల ఆధ్వర్యంలో ఓటరు స్లిప్పుల పంపిణీ



ఆరు జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి డా.మల్లికార్జున, అబ్జర్వర్ జైన్, ఏఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 37 మంది నిలిచారు. మొత్తం 44 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. ఈ నెల 24 న నిర్వహించిన స్క్రూటినీలో నలుగురు అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. మిగిలిన 40 మందిలో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లని ఉపసంహరించుకున్నారు. వీరిలో టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరాములు కూడా ఉన్నారు. సోమవారం ఉపసంహరణ గడువు ముగియడంతో మొత్తం 37 మంది బరిలో నిలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఎ మల్లికార్జున ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతు అభ్యర్థి డా.వి.చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థి మాధవ్ ప్రధాన పార్టీల తరఫున బరిలో ఉన్నారు. అదేవిధంగా ప్రజాసంఘాల తరఫున కోరెడ్ల రమాప్రభతో పాటు మిగిలిన వారందరూ స్వతంత్ర అభ్యర్థులే పోటీలో నిలిచారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమ వారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, ఎన్నికల అబ్జర్వర్ సిద్ధార్థ్ జైన్‌లతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికలకు సంబంధించి వివరాల్ని కలెక్టర్ మల్లికార్జున వెల్లడించారు.

- మార్చి 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ జరగనుంది. 4 లోపు పోలింగ్ స్టేషన్లోకి వచ్చిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తాం. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఒకే ప్రాంతంలో ఎక్కువ పోలింగ్ స్టేషన్లుంటే.. వీడియో కెమెరాల ద్వారా చిత్రీకరించనున్నాం.
- ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు ఎన్నికల సిబ్బంది ఉంటారు. తక్కువ ఓటర్లున్న స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు సిబ్బంది ఉంటారు.
- అన్ని జిల్లాల్లోనూ 20 శాతం రిజర్వ్‌తో పోలింగ్ సిబ్బందిని నియమించాం. ఇప్పటికే మొదటి విడత ట్రైనింగ్ పూర్తి చేశాం. మార్చి 7న మరోసారి శిక్షణ అందించనున్నాం. 6 జిల్లాల్లో రెండు కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్ల ట్రైనింగ్ కూడా పూర్తయింది.
- 37 మంది 7బీ ఫారంలో ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో పేర్లను అమర్చి.. సీఈవో కార్యాలయానికి పంపిస్తున్నాం. అక్కడి నుంచి అనుమతి వచ్చిన వెంటనే బ్యాలెట్ పేపర్లను తయారు చేయనున్నాం.
- 2,89,214 ఓటర్లకు సంబంధించి ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీని మంగళవారం నుంచి బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపడుతున్నాం. ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత ఓటర్లకు స్లిప్పులు అందించి.. అందుబాటులో లేని వివరాలతో కూడిన ఏఎస్‌డీ జాబితాని 10 రోజుల్లో సిద్ధం చేసి ప్రిసైడింగ్ అధికారులకు అందజేసి, అవకతవకలు లేకుండా చూస్తున్నాం.
- 16వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మొత్తం 29 టేబుల్స్‌లో కౌంటింగ్ ప్రక్రియ సాగుతుంది.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే..

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున అభ్యర్థులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులతో సోమవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సిద్ధార్థ్ జైన్‌తో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి అభ్యర్థి ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై సీపీ సీహెచ్ శ్రీకాంత్, అబ్జర్వర్ సిద్ధార్థ్ జైన్‌తో కలిసి ఆర్‌వో, కలెక్టర్ డా.మల్లికార్జున వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

అప్పన్న సన్నిధిలో మల్లీశ్వరి



కరణం మల్లీశ్వరి దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ నాయుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం భారత మాజీ వెయిట్ లిఫ్టంగ్ క్రీడాకారిణి కరణం మల్లీశ్వరి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

కేంద్ర కారాగారంలో మార్చి 12 నుంచి శిక్షణ

ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారంలో మార్చి 12న బ్యూరో ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై అధికారులకు జాతీయ స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు సారథ్యంలో జరగనున్న ఈ శిక్షణకు దేశంలో అన్ని కారాగారాల నుంచి సబ్ జైలర్ స్థాయి నుంచి సూపరింటెండెంట్ వరకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

నూకాంబిక సేవలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్, ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారిని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సోమవారం దర్శించుకున్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, ఎంపీ సత్యవతిలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ వై.వి.సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరించగా, ఆలయ ఈవో చంద్రశేఖర్ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య, కొణతాల నీలిమ, పార్టీ సీనియర్ నేత దాడి జయవీర్, కొణతాల భాస్కరరావు పాల్గొన్నారు.

వారపు సంతకొచ్చిన కొత్త చింతపండు



వారపు సంతకు కొత్త చింతపండు తీసుకొచ్చిన గిరి రైతులు

ముంచంగిపుట్టు: స్థానిక వారపు సంతకు కొత్త చింతపండు వచ్చింది. సోమవారం ఇక్కడకు గిరి రైతులు కావిడలు, బుట్టలతో తీసుకొచ్చారు. దీంతోపాటు ఉసిరి, కొండ చీపుర్లు విక్రయించారు. మట్టి నీటికుండలు సైజును బట్టి రూ. 70 నుంచి రూ. 90 వరకు ధర పలికాయి.

అర్జీలు తిరస్కరిస్తే కారణం చెప్పాల్సిందే..

- జేసీ కల్పనాకుమారి
- కలెక్టరేట్ స్పందనకు 268 అర్జీలు

తుమ్మపాల: స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు స్పష్టమైన సమాధానంతో సమస్య పరిష్కరించాలని జేసీ కల్పనాకుమారి తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీల పరిష్కారం చేసేది లేనిది ప్రజలకు తెలియజేయాలన్నారు. తిరస్కరించినట్లయితే, అందుకు కారణాలను తెలపాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో దివ్యాంగుల వద్దకు వెళ్లి డీఆర్వో వెంకటరమణ అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ వారం మొత్తం 268 దరఖాస్తులు నమోదయ్యాయి.

కుమారులు రోడ్డున పడేశారు..



వృద్ధ దంపతులు ఆకుల వెంకటేశ్వరరావు, సత్యకుమారి

వృద్ధాప్య దశలో మమ్మల్ని కుమారులు చూడటం లేదు. వారి నుంచి జీవన భరోసా కల్పించాలని పాయకరావుపేట దుర్గానగర్‌కు చెందిన ఆకుల సత్యకుమారి, వెంకటేశ్వరరావు దంపతులు కలెక్టరేట్‌లో మొరపెట్టుకున్నారు. ఇద్దరు కుమారులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్ మా ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. కనీసం నెలవారి ఖర్చులు ఇవ్వకుండా రోడ్డున పడేశారు. అడిగితే దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నా భర్త వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నామని సత్యకుమారి వాపోయింది.

దౌర్జన్యంగా మా భూమిలోకి వచ్చి దాడి చేశారు..



ఉప్పిలి అప్పారావు, వరలక్ష్మి, కుమారుడు నాగరాజు

వారసత్వంగా సాగు చేసుకుంటున్న మా భూమిలో పంటను ధ్వంసం చేసి వృద్ధుడైన నా తండ్రిపై కత్తితో దాడి చేశారని జొన్నపల్లి వెంకటరమణ, జొన్నపల్లి దేముడు నాయుడు పలువురు నిందితులపై చర్యలు తీసుకోవాలని ఉప్పిలి అప్పారావు, ఆయన భార్య వరలక్ష్మి, కొడుకు నాగరాజు స్పందనలో ఫిర్యాదు చేశారు. చోడవరం మండలం గవరవరంలో మాకు భూమి ఉందన్నారు. ఈ దాడిని ఖండిస్తూ బాధితులకు న్యాయం చేయాలని చోడవరం తహసీల్దారును జేసీ ఆదేశించారని నాగరాజు తెలిపారు.



స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కల్పనాకుమారి

వీఆర్వోపై ఫిర్యాదు

ఆక్రమణదారులను ప్రోత్సహిస్తున్న వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగేశ్వరరావు స్పందనలో ఫిర్యాదు చేశారు. రేబాకలో సర్వే నంబరు 99లో శంకరం గ్రామానికి చెందిన కొంతమంది కొండను తవ్వి గ్రావెల్ విక్రయించారని, ఆ ప్రాంతాన్ని చదును చేసి ప్లాట్లుగా వేసి స్థలాలను అమ్ముకుంటున్నారని వాపోయారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 32 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిసాలి

అనకాపల్లి టౌన్: తన కార్యాలయంలో సోమవారం స్పందనకు 32 అర్జీలు వచ్చినట్టు ఎస్పీ గౌతమిసాలి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, వారి నుంచి అర్జీలు స్వీకరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో ఆమె మాట్లాడుతూ చట్ట పరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, తదితర వాటిపై అర్జీలు వచ్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

బైక్ చార్జింగ్ ఆటోమేటిక్ యంత్రం ఆవిష్కరణ



యంత్రం తయారు చేసిన విద్యార్థులతో ప్రాజెక్టు హెచ్‌వోడీ పూర్ణప్రియ



బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థులు తయారు చేసిన యంత్రం

అనకాపల్లి టౌన్: స్థానిక డైట్ కళాశాల బీటెక్ థర్డ్ ఇయర్ ఈసీఈ విద్యార్థులు ఆటో కట్ ఎలక్ట్రిక్ బైక్ చార్జర్ మిషన్‌ను రూపకల్పన చేసి సోమవారం కళాశాల ఆవరణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. నరసింహం మాట్లాడుతూ బ్యాటరీ టెంపరేచర్ పెరగ్గానే చార్జర్ ఆఫ్ చేసే పరికరాన్ని విద్యార్థులు ఆడారి యశ్వంతిని, కొణతాల దివ్యశ్రీ, ఎ.శ్రీరామ్ సాయికుమార్, కాండ్రేగుల సంజన తయారు చేయడం అభినందనీయమన్నారు. యంత్రానికి ఉపయోగించే పరికరాలు పవర్ సప్లయి, టెంపరేచర్ సెన్సార్, ఫ్యాన్, బజర్, రెలే మోడ్యుల్ ఉపయోగించినట్లు వివరించారు. రూ.1500లతో ఈ యంత్రాన్ని తయారు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు గైడ్ హెచ్‌వోడీ పి.పూర్ణప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ అదాలత్‌తో సమస్యల పరిష్కారం

- విశాఖ పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టరు కృష్ణమోహన్



ఈపీఎఫ్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణమోహన్

అనకాపల్లి టౌన్: ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్)లో సభ్యత్వం తీసుకున్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈపీఎఫ్ అదాలత్ కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిందని విశాఖ పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టరు, అదాలత్ అధ్యక్షుడు కె.వి. కృష్ణమోహన్ తెలిపారు. అదాలత్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక డైట్ కళాశాల ఆవరణలో సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 27న ఈపీఎఫ్ అదాలత్‌ను కొత్తగా ఏర్పాటు చేశారన్నారు. ప్రతి నెలా 27వ తేదీన జిల్లాల్లో అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్‌లో సభ్యత్వం తీసుకున్న ప్రతీ ఉద్యోగి సమస్యను అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. త్వరలో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖ పీఎఫ్ కార్యాలయం సీనియర్ అకౌంటెంట్లు నారపిన్ని రమేష్, పి.కామేశ్వరరావు, ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ) సూపరింటెండెంట్ అప్పారావు, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో టి.అర్జాపురం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

రావికమతం: తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో జరిగిన జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో టి.అర్జాపురం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. గతంలో వరంగల్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన వీరు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఏపీ జట్టు తరఫున బాలికల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీపడిన పి.పూర్ణ ద్వితీయ స్థానాల్లో నిలిచింది. బాలుర డబుల్స్ విభాగంలో పోటీపడి రాజాన రమేష్‌నాయుడు ద్వితీయ స్థానంలో నిలిచాడు. తమిళనాడు జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్టు హైస్కూల్ హెచ్‌ఎం కె.ఆర్.ఎస్ నాయుడు, పీడీ రమేష్‌నాయుడు సోమవారం తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ATCHUTAPURAM EFFLUENT TREATMENT LIMITED
CIN No: U41000AP2016PLC103829
ADMIN. OFFICE: Ground Floor, One Stop Servicecenter, APIIC Industrial Estate (APSEZ), ATCHUTAPURAM - 531 011.
Contact : 95333 09496 EMAIL: admin@aetltd.org

Notice Inviting Sealed Bids
Name of the work: Supply of Coal of 1500 metric Tonnes.
Sealed bids invited in two cover system from interested bidders for supply of imported coal to M/s. AETL, Atchutapuram Interested bidders may collect the Bid Documents by paying documents fees of Rs.2360/-in the form of DD in favour of "ATCHUTAPURAM EFFLUENT TREATMENT LIMITED" payable Visakhapatnam from 28/02/2023 to 07/03/2023 latest by 15:00 Hrs at our ADMIN OFFICE. Last Date for receipt of Sealed Tenders/Quotations is 07/03/2023 latest by 15:30 hrs.
Managing Director
M/s. AETL, Atchutapuram

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన

కశింకోట: రాష్ట్ర స్థాయి ఆహ్వానపు ఆల్ స్టైల్స్ కరాటే టోర్నమెంటు-2023లో కశింకోట సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థులు పతకాల పంట పండించారు. మొత్తం 12 మంది పతకాలు గెలుచుకుని జిల్లాకు ప్రథమ స్థానం తెచ్చారు. ఈ టోర్నమెంట్ ఇటీవల తునిలో జరిగింది. దీనిలో ప్రథమ స్థానంలో నలుగురు, ద్వితీయ స్థానంలో ఐదుగురు, తృతీయ స్థానంలో ముగ్గురు విద్యార్థుల చొప్పున పతకాలు, ప్రశంసా పత్రాలు పొందారు. వీరితోపాటు కోచ్ సిహెచ్. అప్పారావును ప్రిన్సిపాల్ మహేష్, అకడమిక్ ఇన్‌చార్జి రూపానంది సోమవారం అభినందించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు



మౌనిక

కోటవురట్ల : యువతి అదృశ్యంపై స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు అందింది. ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం కొడవటిపూడి గ్రామానికి చెందిన టేకు మౌనిక అనే 17 ఏళ్ల యువతి ఈ నెల 16వ తేదీ నుంచి కనిపించడంలేదని ఆమె తండ్రి అప్పారావు ఫిర్యాదు చేశారు. ఉదయం పది గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మౌనిక తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా కనిపించలేదని, దాంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

కారుబోల్తా పడి ఐదుగురికి గాయాలు



బోల్తా పడిన కారు



ప్రమాదంలో గాయపడిన బాధితులు

నక్కపల్లి : మండల కేంద్రంలో జాతీయ రహదారిపై వీవర్స్‌కాలనీ సమీపంలో సోమవారం కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. ప్రమాదం గమనించి స్థానికులు కారులోని వారిని బయటకు తీసుకువచ్చి సమీపంలో ఉన్న ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివరాలివి. విశాఖపట్నానికి చెందిన ఎం.మోహన్‌రావు కుటుంబం అన్నవరం దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో నక్కపల్లి చేరుకోగా వీవర్స్‌కాలనీ సమీపంలో కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మోహన్‌కుమార్‌తో పాటు, అతని కుటుంబ సభ్యులు రాజ్యలక్ష్మి, సౌమ్య, కార్తీక్, పంచిరెడ్డి రమేష్‌లకు గాయాలయ్యాయి. వీరికి నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల అక్రమ రవాణా పట్టివేత



స్వాధీనం చేసుకున్న ఎద్దులు, ఆవులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం కూడలిలో అక్రమంగా కంటైనర్‌లో తరలిస్తున్న 44 పశువులను సోమవారం పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా ఒడిశా నుంచి కేరళకు కంటైనర్‌లో తరలిస్తుండగా 42 ఎద్దులు, 2 ఆవులను పట్టుకున్నామన్నారు. వీటితోపాటు కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రైవర్ కర్నాటక రాష్ట్రం హాసన్న జిల్లాకు చెందిన మోహన్ బిడారై దయానంద(27)ను అరెస్టు చేశామన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి



మృతుడి జేబులో లభించిన ఆధార్‌కార్డు ఫొటో

పాయకరావుపేట : నామవరం గ్రామ సమీపాన గల ఒక రైతు పొలంలో వున్న చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. సుమారు 30 సంవత్సరాలు వయస్సు గల పురుషుడు చెట్టుకు ఉరి వేసుకున్నాడని, మృతదేహం కుళ్ళిపోయి, గుర్తుపట్టలేని విధంగా వుందని తెలిపారు. మృతుడి ఫ్యాంటులో ఉన్న ఆధార్‌కార్డును పరిశీలించగా జోగేల్‌రాయ్ అను పేరుతో కర్గపూర్ (అస్సాం) అడ్రస్‌తో కూడిన ఆధార్‌కార్డు, ఓటరు కార్డు లభ్యమయ్యిందన్నారు. మృతుడు నలుపు రంగు ఫుల్ ఫ్యాంట్, మాసిన గెడ్డం, బట్టల తల, చామనఛాయతో సన్నగా, పొడవుగా వున్నాడన్నారు.ఎడమ చేతి భుజంపై శిలువ మార్కు ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రమణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్పీ ఎస్ఐ శాంతారాం

అనకాపల్లిటౌన్ : గుర్తు తెలియని రైలు కిందపడి అనకాపల్లి మండలం దర్జినగర్ గ్రామానికి చెందిన నందవరపు రమణ(42) సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శాంతారాం తెలిపిన వివరాలివి. యలమంచి నుంచి విశాఖ వెళ్తున్న రైలు అనకాపల్లి పట్టణంలో విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి బహిర్భూమి నిమిత్తం రైల్వే ట్రాక్‌పై వెళుతున్న సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రమణ బవులవాడలో ప్రైవేట్ స్టోన్ క్రషర్‌లో దినసరి కూలీగా విధులు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

వరహానదిలో పడి వ్యక్తి మృతి



కొండయ్య మృతదేహం

ఎస్.రాయవరం : వమ్మవరం శివారు అగ్రహారం సమీపంలో వరహానదిలో పడి వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు సోమవారం తెలిపారు. రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సర్వసిద్ధి కొండయ్య(52) అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ నదిలో పడి ఉండవచ్చని చెప్పారు. రాంబిల్లి మండలానికి చెందిన కొండయ్య కొన్ని రోజులుగా అమ్మగారి గ్రామం ఎస్.రాయవరం మండలం లింగరాజుపాలెంలో నివాసం ఉంటున్నట్టు చెప్పారు. మద్యం అలవాటు ఉన్న కొండయ్య మద్యం సేవించినప్పుడు, మత్తులో ఉన్నప్పుడు నదిలో పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు చెప్పినట్టు తెలిపారు. వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పులకించిన పొల్లూరు

- ఘనంగా మన్యంకొండ జాతర
- మూడు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం
- పటిష్ట బందోబస్తు మధ్య వనదేవతల శోభాయాత్ర
- పట్టు వస్త్రాలు సమర్పించిన అధికారులు
- భారీస్థాయిలో అన్నదానం, సేవా కార్యక్రమాలు



పొల్లూరు జలపాతాల వద్ద పుణ్యస్నానాలకు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

మోతుగూడెం: ఒడిశా గిరిజనుల ఆరాధ్యదైవమైన మన్యంకొండ జాతరకు తరలివచ్చిన భక్తజనం పులకించిపోయారు. ఆంధ్రాతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. ఉదయాన్నే సీలేరు నది వద్ద ఒడిశా పొల్లూరు గ్రామ వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు భక్తిశ్రద్ధలతో వనదేవతలను ప్రత్యేకంగా తయారుచేసిన దోనెతో ఊరేగింపుగా తీసుకొని ఆంధ్రా పొల్లూరు గ్రామానికి తీసుకువచ్చారు. ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన మీదుగా ఒడిశా నుంచి వేలాదిమంది గిరిజన భక్తులు తరలివచ్చారు.

జలపాతం వరకు శోభాయాత్ర..

సీలేరు నది దాటిన తరువాత వనదేవతలకు ఆంధ్రా అధికారుల బృందం, ఏఎస్పీ మహేశ్వర్ రెడ్డి, ఏపీ జెన్‌కో ఉన్నత అధికారులు బృందం పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పొల్లూరు జలపాతం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పొల్లూరు జలపాతం వద్ద పూజారులు వనదేవతలకు ప్రత్యేక పూజలు అనంతరం స్నానం చేయించారు. బంగారు చేప కనిపించిందని పూజారులు చెప్పడంతో భక్తులు సంతృప్తి చెందారు. అనంతరం వనదేవతలు పొల్లూరు మీదుగా శోభాయాత్రతో వనదేవతలను ఒడిశాలోని పొల్లూరు గ్రామానికి తరలించారు. రాత్రికి పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి సబ్‌కలెక్టర్ అక్షయ్‌కుమార్, ఐటీడీఏ పీవో మచిత్రినాథ్ యాత్రలో పాల్గొన్నారు. వేలాది మందికి వచ్చిన భక్తులకు పొల్లూరు, మోతుగూడెం ప్రజలతోపాటు జాతర కమిటీ సభ్యులు భోజన ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. అగ్నిమాపకశాఖతోపాటు వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డీఎంహెచ్‌వో పుల్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం ఏర్పాటు చేశారు. మోతుగూడెం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుమారు ఐదు వేల మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.పొల్లూరు జాతర కమిటీ సభ్యులు, మోతుగూడెం ప్రజలు 20 వేల మందికి అన్నదానం నిర్వహించారు. భక్తులకు పోలీసుశాఖతోపాటు పొల్లూరు, మోతుగూడెం ప్రజలు, జాతర కమిటీ సభ్యులు వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. వనదేవతలకు మంగళ స్నానం తరువాత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొట్టుదొడ్డిపై పోలీసు అధికారులు పటిష్ట భద్రత కల్పించారు.



శోభాయాత్రలో వన దేవతల ఊరేగింపు

ఇనుప డ్రమ్‌లో లిక్విడ్ పేలి ఒకరికి గాయాలు

హుకుంపేట : పసుపు ఉడకబెట్టేందుకు తీసుకొచ్చిన ఇనుప డ్రమ్ పేలి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. మట్టుజోరు పంచాయతీ కుంతుర్ల గ్రామానికి చెందిన మర్రి గణేష్ తాను పండించిన పసుపు ఉడకబెట్టడానికి వారపు సంతలో ఇనుప డ్రమ్ కొనుగోలు చేశారు. డ్రమ్ మూతను ఎలక్ట్రికల్ మిషన్‌తో కట్ చేయడంతో డ్రమ్‌లో ఉన్న కొంచెం లిక్విడ్ ఒక్కసారిగా ఫైర్ అయింది. దీంతో గణేష్ శరీరం మొత్తం కాలిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకు వెళ్లడంతో ప్రస్తుతం ఆయనకు ప్రాణాపాయం ఏమీ లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇల్లు కాలిపోయి రూ.5 లక్షల ఆస్తి నష్టం

హుకుంపేట : ప్రమాదవశాత్తూ ఇల్లు దగ్ధమై రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గత్తుం గ్రామానికి చెందిన పాంగి మత్స్యరాజు ఇల్లు ఆదివారం రాత్రి కాలి బూడిదైంది. ఈ అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని ఇంటి యజమాని తెలిపారు. గ్రామంలో ఆరోజు శుభకార్యం జరగడంతో కుటుంబం మొత్తం బంధువుల ఇంటివద్దకు వెళ్లామని ఆదే సమయంలో ఇల్లు కాలిపోయిందని ఆయన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న రెవిన్యూ శాఖ ఆర్ఐ రంగారావు గ్రామానికి చేరుకుని దగ్ధమైన ఇల్లు, ఇంట్లో సామగ్రి పరిశీలించి సుమారుగా రూ.5లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉందని తెలిపారు. నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

BUILDING FOR SALE
New 3 Floor Building for Sale. Near MVGR College, Chintalavalasa. Ph : 72868 62372, 98481 55578 [V- 1758]

FLAT FOR SALE
మురళీనగర్ వర్మ కాంప్లెక్స్ దగ్గర గల SSP రెసిడెన్సీ నందు 1045 Sft., 2 BHK Flat అమ్మకమునకు కలదు. సెల్ : 95152 18373 [V- 611]

Services

BUSINESS OFFER
మీరు మీఇంటి వద్దేఉంటూ పేపర్‌ప్లేట్స్ / హోమ్ మేడ్ ఫుడ్స్ లాంటి వ్యాపారాలు చేయదలచుకుంటే మీకు అవసరమైన పెట్టుబడిఇస్తాం, వ్యాపార సమాచారం(ట్రైనింగ్) మేమిస్తాం. ఆసక్తి గలవారు M/F వెంటనేసం॥. కొద్దిమందికి మాత్రమే ✆ 94918 88853 [O-787001]

ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034974058 [H-792938]

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి ఆదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 4123]

OLD AGE HOME
Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [V- 775157]

Wanted

మీ బైకే మీకు ఆదాయం తెస్తుంది. Rs.1500/- Day Benefits : P/F జాబ్, సౌకర్యవంతమైన పని వేళలు, డైలీ / వీక్లీ ఇన్సెంటివ్స్, ఇన్సూరెన్సు 5 లక్షలు వరకు. ఫోన్ : 040-48937619, 73962 67109 [V-10173]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781909]

సెక్యూరిటీ గార్డులు కావలెను : 15 రోజులు AU గ్రౌండ్స్, RTC కాంప్లెక్స్ ఏరియాల్లో పనిచేయుటకు. రోజుకి రూ. 500/- + భోజనం. సంప్ర : 81795 52684 / 83095 64664 [V- 2587]

Wanted Service Engineer / Mechanic for DI/DR of UPS-600 VA-20KVA. Qua : ITI / Diploma. Royalle Engineering Enterprise, Old Karasa, NAD. Ph : 79959 10357 [V- 6467]

Required Writer Safegurd Pvt Ltd. - Vizag. Executives Salary - 10,800/- & Drivers Salary - 12,500/-. Qlf : SSC, Age : 20 to 35. Cell : 77997 75338, 89856 89076 [V- 10233]

కష్టపడేతత్వం, ఎదగాలనే తపనవున్న వారికి అద్భుత అవకాశం. మీ నిత్యవసరాల ఖర్చు ద్వారా అధిక ఆదాయం పొందగలరు. ఉద్యోగులు, నిరుద్యోగులు, గృహిణిలు, స్టూడెంట్‌కి పార్ట్/ఫుల్‌టైం అవకాశం. శాలరీ + ఇన్సెంటివ్స్ కలవు. ఫోన్ : 73863 48848 [V- 5636]

Tailor Cutting master wanted for Ladies Boutique @ seethammadhara Exp. in all types of fashion wear salary on experience. Cont : 73962 89349, between 10 AM to 7 PM [V- 7359]

అగ్రికల్చర్ ఫీల్డ్ వర్క్ చేయుటకు 10th to డిగ్రీ గల స్టాఫ్ కావలెను. జాబ్స్ (1) D.C.O - జీతం : 22 వేలు + 3 వేలు. & ఫీల్డ్ ఆఫీసర్ : జీతం : 14 వేలు + 2,500. 7680002670, 8885863691. [A-734033]

హైదరాబాద్‌లోని అప్నా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Caretakers కావలెను. జీతం: 16-18 వేలు, భోజనం,వసతి,ఇన్సూరెన్సు కలవు.9381848549 [G-394]

ప్రముఖ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లో కార్గో లోడర్స్, హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ కావలెను, జీతం: 22000/- ఆపైన, వ: 18-35, రూమ్+ భోజనం ఫ్రీ. ఫోన్ : 8886186894. [H-778970]

ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉంటూ పార్ట్ టైమ్/ఒక గంట చేతివ్రాత ద్వారా పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్. 7702473949 [G-781921]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థుల్లో నైపుణ్యాలు



చిత్రలేఖన పోటీల విజేతలతో ఓంరామ్, పరిషత్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని భారత్ వికాస్ పరిషత్ అనకాపల్లిశాఖ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్ అన్నారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులు ఎంతో నైపుణ్యం కలిగిఉంటారని, దాన్ని మరింత సానపెట్టేలా ఉపాధ్యాయులు కృషి చేసినట్లయితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో పరిషత్ సౌత్ ఇండియా సంపర్క్ ఎస్.గోపాలరావు, సభ్యులు వై.కేశవరావు, ఎస్.కోటేశ్వరరావు, ఎస్ఏబీ వర్మ, ఉమామహేశ్వరరావు, దుర్గాప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగానే ఉన్నాయి. కిలో ఉల్లి, టమాటా రూ.20, బంగాళాదుంప, వంకాయ రూ.30, క్యారెట్, బీట్‌రూట్, దొండ, చిక్కుడు రూ.40, బెండకాయ, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

నాటిక పోటీలకు ఏర్పాట్లు



నాటిక పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి రూరల్: మార్చి 20, 21, 22 తేదీల్లో అనకాపల్లిలో జ్యోతి సరళ స్మారక పరిషత్ నాటిక పోటీలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి పట్టణ సీపీఎం కార్యాలయంలో పరిషత్ నాటిక పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాటిక పోటీల కో–ఆర్డినేటర్ పీలా చిన్నమ్మనాయుడు మాట్లాడుతూ 1975 ఎస్ఎస్‌సీ బ్యాచ్ సహకారంతో నాటికల పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొప్పే ఉమామహేశ్వరరావు, రాపేటి నారాయణరావు, ఎన్‌కే శర్మ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్–1
కింగ్	సత్యనారాయణ స్క్రీన్–2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
డెడ్‌లైన్	పర్తిసాయి
వీరసింహారెడ్డి	వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 10,161 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,550	4,010
మొదటి రకం	3,380	3,650
రెండో రకం	3,100	3,520
మూడోరకం	2,950	2,090

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–23 యూనిట్లు, ఓ పాజిటివ్ 14 యూనిట్లు, ఏబీ పాజిటివ్–5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 511 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.



గొర్రెలు, మేకల విక్రయాల జోరు



మేకలు, గొర్రెలను కొనుగోలు చేసి వ్యాన్లలో తరలిస్తున్న వ్యాపారులు



తాళ్లపాలెం సంతకు అమ్మకానికి తీసుకువచ్చిన మేకలు

- కొత్త అమావాస్య ముందు సంతలో ఊపందుకున్న క్రయవిక్రయాలు
- కోస్తాంధ్ర నుంచి భారీగా తరలివస్తున్న మేకలు, గొర్రెలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు జోరందుకున్నాయి. గత వారం వరకు అమ్మకాలు కాస్త స్తబ్దంగా ఉన్నాయి. కొత్త అమావాస్య జాతర సమీపిస్తుండటంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. ధరలు కూడా కాస్త పెరిగాయి. దీంతో పెంపకందార్లు, రైతులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోస్తాంధ్ర నుంచి భారీగా జీవాలు

తాళ్లపాలెం వారపు సంతకు పూర్వపు విశాఖ జిల్లాతోపాటు తూర్పుగోదావరి, ఏజెన్సీ ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకల పెంపకందార్లు ప్రతి వారం వస్తుంటారు. వీటిని కొనుగోలు చేయడానికి ఆయా ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు, హోటళ్ల నిర్వాహకులు, మందలుగా మేపుకునే పెంపకందారులు వస్తుంటారు. వీటిని కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు తీసుకు వెళుతుంటారు. దసరా, సంక్రాంతి, కొత్త అమావాస్య, తదితర పెద్ద ఉత్సవాలతోపాటు గ్రామాల్లో జరిగే ఉత్సవాలకు గొర్రెలు, మేకలను కొనుగోలు చేస్తారు. అయితే సంక్రాంతి తర్వాతి నుంచి గత వారం వరకు గ్రామాల్లో చెప్పుకోదగిన పెద్ద ఉత్సవాలు లేవు. దీంతో డిమాండ్ లేక గొర్రెలు, మేకల అమ్మకాలు తగ్గాయి. సంతకం వీటి రాక కూడా తగ్గింది.

మందలుగా కొనుగోళ్లు

అయితే వచ్చే నెలలో జరగనున్న కొత్త అమావాస్యకు జిల్లాలో జాతరలు నిర్వహించడానికి దాదాపు ప్రతి గ్రామంలోను గొర్రెలు, మేకలు వినియోగిస్తారు. దీంతో వీటికి గిరాకీ ఏర్పడుతోంది. కొందరు ముందుగానే వీటిని కొనుగోలు చేసి ఉత్సవాలకు సిద్ధం చేస్తారు. ఈ నేపథ్యంలో సంతకు సుమారు వెయ్యి వరకు గొర్రెలు, మేకలు అమ్మకానికి వచ్చాయి. జీవాల సైజ్, వయసు ఆధారంగా రూ.3 వేల నుంచి రూ. 20 వేల వరకు అమ్మకాలు సాగాయి. ఒక్కొక్కదానికి గత వారం కంటె రూ.2 వేలు ధర అదనంగా పెరిగిందని వ్యాపారులు తెలిపారు. వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు వీటిని కొనుగోలు చేసి ఆటోల్లోను, వ్యాన్లలో తమ ప్రాంతాలకు తరలించుకు వెళ్తున్నారు. కొందరు జీవనోపాధి కోసం గొర్రె, మేకల మందలను కొనుగోలు చేశారు.

ఎరువు కోసం మంద కొనుగోలు

ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం కావడంతో ఖరీఫ్ పంటలు వేసే వరకు పంట భూములు ఖాళీగా ఉండటం వల్ల మేతకు అనువుగా ఉంటుంది. కొందరు రైతులు కూడా తమ భూముల్లో సారం కోసం గొర్రెలు, మేకల మందలను ఖాళీగా ఉన్న భూముల్లో ఏటా ఎరువు కోసం రాత్రి వేళ నిలుపుతారు. ఇందు కోసం కొందరు మందలను కొనుగోలు చేస్తారు. అలాగే మందలో మేకలుగాని, గొర్రెలు గాని ఎదిగిన తర్వాత కుటుంబ అవసరాలకు అమ్ముకుంటాం. ఇప్పుడు మేపుకోవడానికి రూ.2.5 లక్షలు ఖర్చు చేసి గొర్రెల మందను కొనుగోలు చేశా.

– ఈగల సతీష్, కట్టుబోలు

ఘనంగా దేవాంగుల ఆత్మీయ సమారాధన



దేవాంగ సంక్షేమ సంఘం ఆత్మీయ సమారాధనలో సన్మానం అందుకున్న సంఘ నేతలు

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల బంగార్రాజు కల్యాణ మండపంలో అనకాపల్లి పట్టణ చౌడేశ్వరీ దేవాంగ సంక్షేమ సంఘం ఆత్మీయ వన సమారాధన సోమవారం ఘనంగా జరిగింది. ముందుగా రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, దేవాంగ సంక్షేమ సంఘం కమిటీ సహాయ కార్యదర్శి బల్లా నాగభూషణం, సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావులు చౌడేశ్వరీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన సినీ దర్శకుడు త్రినాథరావు మాట్లాడుతూ తన బాల్యం అనకాపల్లిలోనే గడిచిందని, ఈ పట్టణం అంటే తనకు ఎంతోఇష్టమన్నారు. చౌడేశ్వరి సాంబ శివాలయం అభివృద్ధి కోసం రూ.25వేలు ఆర్థికసాయాన్ని కమిటీకి అందించారు.పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సమావేశంలో 2500 మంది హాజరయ్యారు. వన సమారాధనలో సంఘ జిల్లా, రాష్ట్ర, పట్టణ ప్రతినిధులు పాల్గొన్నారు.

7న పరదేశిమాంబ పండగ



పోస్టర్ ఆవిష్కరణలో సర్పంచ్ దేవి, గ్రామ పెద్దలు

పరవాడ: తానాం గ్రామంలో వచ్చే నెల 7న పరదేశిమాంబ అమ్మవారి పండగ జరగనుంది. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను సర్పంచ్ కన్నూరు దేవి, గ్రామ పెద్దలు సోమవారం ఆవిష్కరించారు. పండగను పురస్కరించుకుని వచ్చే నెల 5 నుంచి 7 వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ నెల 24న ప్రారంభమైన మండల స్థాయి బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు మార్చి 6 వరకు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కన్నూరు వెంకటరమణ, మాజీ సర్పంచ్ పైల రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పైల కృష్ణారావు, పెద్దలు వర్రి వసంతరావు, పైల జానకీరావు, దేముడుబాబు, గొరుపూటి సన్యాసిరావు, పైల ముని పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్‌కు హెచ్‌పీసీఎల్ వితరణ



ఎంపీపీ స్కూల్‌కు మౌలిక సదుపాయాలు కల్పించిన హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

కోటవురట్ల : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు హెచ్‌పీసీఎల్ అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని ఎంఈవో పి.అప్పారావు అన్నారు. సుంకపూరు ఎంపీపీ స్కూల్‌కు హెచ్‌పీసీఎల్ కంపెనీ రూ.2 లక్షలు విలువ చేసే బెంచీలు, కుర్చీలు, బీరువాలు ఇతర వస్తువులను వితరణగా అందజేసింది. కంపెనీ ప్రతినిధులు ఎ.చిరంజీవి, కె.బిందుసాయి, కృష్ణంరాజు వాటిని పాఠశాలకు సోమవారం అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలను నాడు–నేడు ద్వారా అద్భుతంగా అభివృద్ధి చేస్తోందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్యార్థులకు కావలసిన వనరులను అందిస్తోందన్నారు. పాఠశాలల అభివృద్ధికి హెచ్‌పీసీఎల్ వంటి కంపెనీలు తోడ్పాటు అందివ్వడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిటికెల కాశీలక్ష్మి ఉపాధ్యాయుడు రమణ, పేరెంట్ కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

తోటాడ గంగ పరదేశమ్మతల్లి పండగ నేడు

మునగపాక : మండలంలోని తోటాడలో మంగళవారం గంగ పరదేశమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదే రోజు రాత్రి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడి అరెస్ట్

కశింకోట : మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పాన్‌షాపుపై దాడి చేసి నిర్వాహకుడిని పట్టుకున్నట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి సోమవారం తెలిపారు. కె.రాజు తన పాన్‌షాప్‌లో మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ దాడిలో పది క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

సాలాపువానిపాలెంలో బోరు ఏర్పాటు

పరవాడ: సాలాపువానిపాలెం గ్రామంలో జీవీఎంసీ అధికారులు బుధవారం మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇటీవల జీవీఎంసీ అధికారులతో చర్చించి గ్రామంలో మంచినీటి బోరు ఏర్పాటుకు కృషి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ సాలాపు సంతోష్, అప్పలరాజు, శ్రీను, రాజు, నూకరాజు, రామకృష్ణ, బాబూరావు, దొరబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి'

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, నియోజకవర్గ అభివృద్ధిని స్థానిక మంత్రి పట్టించుకోవట్లేదని మాజీ మున్సిపల్ చైర్మన్ విల్లూరి పైడారావు సోమవారం ఓ ప్రకటనలో ఆక్షేపించారు. మూడేళ్లుగా పరిశుభ్రమైన తాగునీరు అనకాపల్లి ప్రజలకు అందిస్తామన్న హామీ, నీటిపై రాతగానే మిగిలిపోయిందన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం జిల్లా ఆస్పత్రిగా అభివృద్ధి చెందినప్పటికీ సీటీ స్కానింగ్ సౌకర్యం లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ సమస్యలపై మంత్రి దృష్టి సారించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు.

దేవదాయ భూమి వేలం పాట వాయిదా

మునగపాక: రామగిరి కోదండ సీతారాముల ఆలయ భూమికి సంబంధించి వేలం పాట వాయిదా పడిందని ఈవో పీఎస్ఏ మూర్తి తెలిపారు. సోమవారం జరగాల్సిన వేలం పాటకు పాటదారులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్టు చెప్పారు. మరలా ఎపుడు నిర్వహిస్తామనే వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

సీఎం జగన్ హయాంలోనే 'విస్తృత' అవకాశాలు



టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి అనకాపల్లి బెల్లాన్ని అందిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, రవి, చిత్రంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

అనకాపల్లిలోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం సోమవారం జరిగింది. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే విద్యావంతులకు విస్తృత అవకాశాలుంటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, అనకాపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వేదికపై టీటీడీ చైర్మన్, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మశ్రీ, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్యే వెంకట్రామయ్య తదితరులు

ఎండీఎం మెస్ చార్జీలు పెంచాలి



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నేత కోన లక్ష్మణ్

అనకాపల్లి రూరల్ : పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన(ఎండీఎం) కార్మికులకు మెస్ చార్జీలను పెంచి, వారిని ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కోన లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందించారు. 20 సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలను నడుపుతున్న కార్మికులకు ఇప్పటికీ సరైన గుర్తింపు లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వారి కష్టానికి తగ్గట్టు మెస్ చార్జీలు చెల్లించట్లేదని ఆక్షేపించారు. దీంతో ఏజెన్సీలను నడపడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, సబ్సిడీతో గ్యాస్ సరఫరా చేయాలని, వంట షెడ్లు నిర్మించాలని, కార్మికులకు భద్రత కల్పించి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో వై.రాజబాబు, బోయిన శేఖర్, కోన నూకరాజు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు, ప్రశంసా పత్రాలతో కరాటే విజేతలు, కోచ్‌లు

పరవాడ: విశాఖలో యంగ్ ఇండియన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో వాడచీపురుపల్లి డ్రాగన్ లయన్స్ కరాటే విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో వాడచీపురుపల్లి, జాలరిపేట, సమ్మెంగపాలెం, మంగప్పయ్యగారి గ్రామాల నుంచి విద్యార్థులు తలపడ్డారు. ప్రథమ స్థానంలో 19 మంది, ద్వితీయ స్థానంలో 9 మంది, తృతీయ స్థానంలో ముగ్గురు విద్యార్థులు నిలిచారు. విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కోచ్‌లుగా ఎస్.నూకరాజు, ఓలిశెట్టి ప్రసాద్, ఎం.తులసీరావు వ్యవహరించారని కోచ్ పుష్పారావు తెలిపారు.

సన్మార్గమే భవితకు పూలబాట



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

పరవాడ: యువత సన్మార్గంలో నడిచి భవిష్యత్తును పూలబాటగా తీర్చుదిద్దుకోవాలని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు సూచించారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో సోమవారం ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగం, కుల, మత, వర్గ, వివక్ష వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత తప్పుడు మార్గంలో పయనించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాల నివారణ కోసం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ కోరారు. గొప్ప సమాజం కోసం సైనికుడు, రైతు ఎంత అవసరమో సన్మార్గంలో నడిచే యువత కూడా అంతే అవసరమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి పేర్కొన్నారు. విద్యార్థులు తప్పుతోవ పట్టకుండా వారి తల్లిదండ్రులు, విద్యా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈవో కె.నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.

జనుము సాగు.. భూసారం బాగు

- పచ్చిరొట్ట, విత్తనాల కోసం రైతుల సాగు
- మండలంలో 170 ఎకరాల్లో రబీ సాగు



కశింకోట వద్ద సాగు చేస్తున్న జనుము పంట

కశింకోట : మండలంలో భూమి సారవంతం కోసం పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జనుము పంట జోరుగా సాగవుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో రైతులు దీని సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం సుమారు 170 ఎకరాల్లో పంట సాగువుతోంది. సాధారణంగా ఖరీఫ్ వరి సాగు చేసే ముందు పచ్చి రొట్ట ఎరువుగా ఉపయోగపడటానికి దీన్ని సాగు చేస్తారు. మొక్కలు ఏపుగా ఎదిగిన తర్వాత దమ్ములో కలియ దున్నుతారు. ఇది కుళ్లిపోయి భూమి సారవంతమై, పంటకు సహజ సిద్ధమైన ఎరువుగా ఉపయోగపడుతుంది. అలాగే పిల్లి పెసర, జీలుగు పంటలను కూడా సాగు చేసి పచ్చిరొట్ట ఎరువుగా వినియోగిస్తారు. అయితే ప్రస్తుతం ఆదాయం వస్తుండటంతో జనుం రబీ పంటగా కూడా సాగు చేపట్టారు. ఇది ఎక్కువ పెట్టుబడి పెట్టే అవసరం లేకుండా అదనపు ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది.

మూడు నెలల్లో పంట

ఖరీఫ్ వరి కోసిన తర్వాత పదునుగా ఉన్న మడిలో నేరుగా జనుము విత్తనాలు జల్లడంతో అవి మొలకలు వచ్చి ఎదుగుతాయి. సాధారణంగా వాటికి భూమిలో ఉన్న పదును సరిపోవడం వల్ల పెద్దగా నీరు అవసరం ఉండదు. అవసరం అయితే ఒకసారి తడి పెడితే సరిపోతోంది. మూడు నెలల్లో జనుము పంట చేతికి వస్తుంది. ఎకరాకు సుమారు రెండు క్వింటాలు పైబడి జనుము గింజలు దిగుబడి వస్తాయని అధికారులు, రైతులు చెప్తున్నారు. వీటిని మళ్లీ విత్తనాలుగా జల్లుకోవడానికి కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం వీటికి డిమాండ్ ఉంది. ఖరీఫ్ వరి సాగుకు ముందు దీన్ని ఎరువుగా ఉపయోగించడానికి ఎక్కువ మంది రైతులు సాగు చేస్తారు. కిలో విత్తనాలు ధర రూ.60 పలుకుతోంది. ఎకరాకు కాయల కోత కూలీ పోయి సుమారు రూ.10 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. దీంతో దీని సాగుపట్ల రైతులు మొగ్గు చూపుతున్నారు.

వలిసె అందాల జనుము

మండలంలోని కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, జెట్టపురెడ్డితుని, గొబ్బూరు, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, నరసింగబిల్లి, చింతలపాలెం తదితర ప్రాంతాల్లోని ఖరీఫ్ వరి సాగు అనంతరం జనుము పంట వేసి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత దశలో ఉంది. మండలంలో సాగవుతోన్న జనుము పంట పూత ఏజెన్సీలోని అరకు ప్రాంతంలో పండించే వలిసె పూలను తలపిస్తోంది. పసుపు రంగు పూలతో నిండి చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. గొబ్బూరు తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్క ఉన్న ప్రాంతాల్లో సందర్శకులు పంట పొలాల్లోకి వెళ్లి సెల్‌ఫోన్లతో ఫోటోలకు దిగుతున్నారు. దూరం నుంచి చూస్తే వలిసె సాగు జరుగుతుందేమోనని భ్రమిస్తాం.

పచ్చిరొట్టతోపాటు విత్తనాలు

మండలంలో ఈ ఏడాది జనుము పంట విస్తీర్ణం ఆశాజనకంగా ఉంది. రానున్న ఖరీఫ్ కోసం భూమి సారాన్ని పెంచుకునేందుకు ఎక్కువగా దీన్ని సాగు చేస్తున్నారు. సాగు విస్తీర్ణంలోనే రైతులు కొంత మేర విత్తనాల కోసం పంట పండేవరకు ఉంచుతున్నారు. సుమారు 170 ఎకరాల్లో రబీ సాగులో జనుము పంట వేశారు.

–ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి



మునగపాక సచివాలయంలో ఎంపీడీవో రవికుమార్

మునగపాక : సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. సోమవారం ఆయన మునగపాక సచివాలయాన్ని సందర్శించారు. ఉద్యోగుల హాజరు శాతం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సీ ఎన్నికకు సంబంధించి కోడ్ అమలు జరిగేలా చూడాల్సి ఉందన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతీ అర్జీకి సమాధానం అందించాలన్నారు. ఆయన వెంట ఈవో అజయ్‌బాబు ఉన్నారు.

